

నేడు మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన


ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇచ్ఛాపురం నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు శాసనం జంక్షన్ చేరుకున్న అనంతరం బట్టిగల్లూరు నుంచి ఎకువూరు వరకు ర్యాలీలో పాల్గొంటారు. అనంతరం ఎకువూరులో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి, గృహాల వద్ద సుపరిపాలన కార్యక్రమంలో భాగస్వామ్యమవుతారు. అనంతరం ప్రజాసభలో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పర్యటన ముగించుకుని తిరిగి విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.

చినుకు కినుక

- జిల్లాలో ఖరీఫ్ సాగుకు ప్రతికూల పరిస్థితులు
- వేసవి తలపించేలా ఉష్ణోగ్రతల నమోదు
- ఎండిపోతున్న నారుమళ్లు
- 18 మండలాల్లో తీవ్ర వర్షపాతం లోటు

చినుకు కినుక వహించింది. ఖరీఫ్ ప్రారంభమై నెలన్నర రోజులకు పైగా గడుస్తున్నా వర్షం జాడ లేదు. ఈ ఏడాది మే మూడో వారంలోనే రుతుపవనాలు ప్రవేశించడంతో వర్షాలు సమృద్ధిగా పడతాయని రైతులు భావించారు. ఖరీఫ్ ప్రారంభమైన తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో సాగుకు తీవ్ర ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి కాలంలో మాదిరిగా ఎండ వేడిమి ఉండడంతో ఆకుమడులు ఎండిపోతున్నాయి. మరోవైపు తీవ్ర వడగాడ్పులు ఎక్కువగా ఉండడంతో, ఖరీఫ్ సాగుకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. చెరువులూ ఎండిపోతున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. మేఘాలు మబ్బులు పట్టి ఊరించడం తప్ప ఆశించిన వర్షాలు పడకపోవడంతో వేసిన పంటలు దక్కుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అనువైన వర్షం పడలేదు. సీజన్ ప్రారంభమైన జూన్ ఒకటో తేదీ నుంచి శుక్రవారం వరకు సాధారణంగా 274.6 మి.మీ వర్షపాతం నమోదవుతుంది. ప్రస్తుతం 138.7 మి.మీ వర్షం మాత్రమే కురిసింది.

జిల్లావ్యాప్తంగా 49.5 శాతం లోటు నమోదైంది. జిల్లాలో 30 మండలాలు ఉండగా 18 మండలాల్లో వర్షపాతం లోటు ఉండగా, జి.సిగడాం మండలంలో అత్యంత వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఎనిమిది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో కురవాల్సిన వాన కంటే అదనంగా వర్షం కురిసింది. అక్కడక్కడా కాస్తంత వర్షం పడినా, అది ఏమాత్రం సాగుకు ఉపయోగపడలేదు. జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 92 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వర్షపాతం లోటు 31.8 శాతంగా నమోదైంది. జూలై ఒకటో తేదీ నుంచి శుక్ర వారం వరకు 94.7 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 70.2 మి.మీ వర్షం కురిసింది.



బూర్జ మండలం అల్లెనలో మోటారు సాయంతో పొలాలకు పెడుతున్న నీరు

మందకొడిగా సాగు

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మందకొడిగా పంటలు సాగవుతున్నాయి. 2025 ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,07,488 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 1,79,224 ఎకరాల్లో పంటలు వేయగలిగారు. 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం 1,53,113 ఎకరాల్లో వెదలు చల్లారు. 10,343 ఎకరాల్లో నారుమళ్లు వేశారు. మొక్కజొన్న పంటలను 23,873 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 14,963 ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 3,125 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, 505 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారు. చెరుకు పంటను 2,623 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 300 ఎకరాల్లో వేశారు.

రిజర్వాయర్లలో పడిపోతున్న నీటిమట్టం నిల్వలు

వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లాలోని రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటిమట్టం నిల్వలు పడిపోతున్నాయి. ఒడిశాలో కాస్త వర్షాలు పడుతుండడంతో వంశధారలో సాధారణ నీటి ప్రవాహం కొనసాగుతోంది. హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ పూర్తి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.64 టిఎంసిల నీటి లభ్యత ఉంది. మడ్డువలస రిజర్వాయరు సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 3.14 టిఎంసిల లభ్యత ఉంది. తోటపల్లి రిజర్వాయర్ 2.50 టిఎంసిల నీరు లభ్యం కావాల్సి ఉండగా, ప్రస్తుతం 2.06 టిఎంసిల నీరు ఉంది.

పంటను కాపాడుకోవడానికి పాట్లు

వర్షాల్లేక ఒక వైపు, ఎండ వేడిమి ధాటికి పంటలు ఎండిపోతున్నాయి. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చాలాచోట్ల భూమి నెర్రలు బారుతోంది. రుతుపవనాలు మేలోనే ప్రవేశించాయన్న వార్తలతో చాలా చోట్ల రైతులు ముందుగానే విత్తనాలు చల్లుకున్నారు. ప్రస్తుతం ఉబాలు జరగాల్సిన సమయంలో వానలు లేకపోవడంతో, పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇంజిన్ల సాయంతో నీటిని తోడి పొలాలను తడుపుతున్నారు. కాలువలు ఎండిపోవడంతో దూరంగా ఉన్న చెరువుల్లో నుంచి నీటిని తీసుకొస్తున్నారు. సొంత ఇంజిన్లు ఉన్న రైతులకు ఎకరాకు డీజిల్ కోసం రూ.వెయ్యి వరకు ఖర్చు చేస్తున్నారు. సొంత ఇంజిన్లు లేని వారు డీజిల్ ఖర్చుతో పాటు పైపుల కోసం గంటకు రూ.80 వరకు అద్దె చెల్లిస్తున్నారు.



శ్రీకాకుళం సిటీ : నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు శుక్రవారం సమ్మెలో పాల్గొని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది గడిచినా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు 36 జిఒ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు వేతనాలు ఇవ్వాలని, కార్మికులందరికీ తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గత సమ్మెకాలపు హామీలు అమలు చేయాలని కోరారు. సమస్య పరిష్కరిస్తూ స్పష్టమైన జిఒలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఎ.శంకర్, ఎ.మోహన్, ఎన్.పార్వతి, ఎ.లక్ష్మి, ఆర్.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు తాడి సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, నాయకులు జె.శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ పట్నాయక్, డి.లక్ష్మణరావు, డి.ఢిల్లీ, గంగాధర్ రౌతో తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు మూడో రోజు నిరసన చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకట్, సిహెచ్.మురుగన్, ఎం.రవి, ఎస్.శంకర్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

నూతన సాంకేతికతతో కాలుష్య నివారణ

కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య

ప్రజాశక్తి - పలాస, శ్రీకాకుళం సిటీ

నూతన అత్యున్నత సాంకేతికతతో కాలుష్యాన్ని నివారించాలని జీడి వ్యాపారులకు కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య సూచించారు. పలాస ఇండస్ట్రియల్ ఏరియాలోని జీడి పరిశ్రమలను శుక్రవారం పరిశీలించిన అనంతరం పలాస జీడి ఉత్పత్తిదారుల సంఘంలో జీడి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జీడి పరిశ్రమ బాయిలింగ్ విధానంలోకి రావడంతో పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నివారించేందుకు ఎప్పటికప్పుడు నూతనంగా వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రొయ్యల పరిశ్రమల మాదిరిగా జీడిపప్పునూ గ్రేడింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల లాభాలు ఆర్జించవచ్చని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు రాయితీ అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కారుణ్యశ్రీ, జీడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్త, బెల్లాల నారాయణరావు, టి.రమేష్, శాసనపురి మురళి, మల్లా భాస్కరరావు, పలువురు జీడి వ్యాపారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళం లక్ష్యం

అక్టోబరు రెండో తేదీ నాటికి శ్రీకాకుళం నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'స్వచ్ఛ శ్రీకాకుళం' అనే నినాదానికి కట్టుబడి, పట్టణం నుంచి గ్రామస్థాయి వరకు ప్లాస్టిక్ నియంత్రణను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఆర్‌టిఒ, ఆర్‌టిసి, మున్సిపాల్టీలు, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్త చర్యలతో రహదారులు, బస్టాండ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛత సందేశాలతో సైన్‌బోర్డులు తక్షణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం మున్సిపల్ స్థాయిలో విడదీసే సేకరణ, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ వ్యవస్థలు తప్పనిసరి అని కష్ణయ్య గుర్తు చేశారు. అనుమతిలేని పలచని క్యారీ బ్యాగులు, మల్టీ లేయర్డ్ ప్యాకేజింగ్ వినియోగ నియంత్రణపై కఠిన చర్యలు ఉండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఉత్పత్తిదారులు, దిగుమతిదారులు, బ్రాండ్ యజమానులు విస్తరిత ఉత్పత్తిదారుల బాధ్యత (ఇపిఆర్) కింద సేకరణ-రీసైక్లింగ్‌కు ముందుండాలని, అవసరమైతే బై బ్యాక్ డిపాజిట్ విధానాలు అమలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘనలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జరిమానాలు, కేసులు, లైసెన్స్ రద్దు వంటి శిక్షలు విధించే అధికారం కలిగి ఉందని హెచ్చరించారు. జిల్లాలో చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల గురించి కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పృథ్వీరాజ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ కరుణశ్రీ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ బి.వి.డి ప్రసాదరావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులు, అర్హత గల ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57ను అనుసరించి పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. డిఎస్‌సి-2003 ఫోరం ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా శుక్రవారం ధర్నా చేపట్టారు. ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి ధర్నాకు సంఘీభావం తెలిపారు. 2004 నుంచి నూతన పింఛన్ విధానం (సిపిఎస్) అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వ పరిపాలనా కారణాల వల్ల డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల నియామకాల్లో జాప్యమైందని గుర్తుచేశారు. అధికారుల తప్పిదం వల్ల తమకు పాత పింఛన్ విధానం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 మేరకు తమకు పాత పింఛన్ పొందే అర్హత, హక్కు ఉందన్నారు. దేశంలో 16 రాష్ట్రాలు, రైల్వే, తపాలా, వంటి శాఖలు పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. అధికారులకు మెమో మేరకు పాత పింఛన్ అమలు చేస్తున్నారని, ఉపాధ్యాయులకు మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ గత, ప్రస్తుత ప్రభుత్వానికి అనేకమార్లు వినతిపత్రాలు సమర్పించామన్నారు. స్వయంగా సిఎం, డిప్యూటీ సిఎం, విద్యాశాఖ మంత్రికి తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫైల్ నంబరు 1273065 ద్వారా పాత పెన్షన్‌కు అర్హత కలిగిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలను సేకరించి ఐదేళ్ల తాత్సారం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోని ముగ్గురు ఐఎఎస్‌లకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ మంజూరు చేస్తూ దిగువస్థాయి ఉద్యోగులకు మంజూరు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా కన్వీనర్ కె.శ్రీహరి, రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు, సహాయ కన్వీనర్ ప్రకాష్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, తమ్మినేని ఆనందరావు, పప్పల రాజశేఖర్, ప్రతినిధులు శ్రీకర్, లక్ష్మణ్, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులు

ట్రిపుల్ ఐటిలో తొలి క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటీ) క్యాంపస్‌లో తొలిసారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన మియామి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ డ్రైవ్‌ను నిర్వహించగా, సుమారు 180 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ, 'ట్రిపుల్ ఐటి స్థాపించిన తొలినాళ్లలో ఇంజనీరింగ్ విద్యార్థులకు నూజివీడులో తరగతులు నిర్వహించేవారని, అందుకే ఇప్పటివరకు క్యాంపస్ డ్రైవ్‌లన్నీ అక్కడే జరిగాయని తెలిపారు. ఇప్పుడు ఎచ్చెర్ల క్యాంపస్‌లోనే అన్ని ఇంజనీరింగ్ పిఇయుసి, క్లాస్ వర్క్‌లు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని అవకాశాలు వస్తాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, సిఎస్ఇ విభాగాధిపతి రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి వరప్రసాద్, మియామి టెక్నాలజీస్ ప్రతినిధులు నవీన్, రవిరామ్ వర్మతో పాటు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విభాగాధిపతులు, సిబ్బంది, ప్లేస్‌మెంట్ టీమ్ ఇంటర్న్‌లు వాగ్దేవి, ప్రహర్షిత్‌లు పాల్గొన్నారు.



ఎఎంసి ఛైర్మన్‌ను పున:పరిశీలించాలి

జనసేన కార్యాలయం వద్ద కార్యకర్తల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన జనసేన నాయకులు దారపు జ్యోత్స్న పేరును పున:పరిశీలించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎఎంసి ఛైర్మన్ పేరును పున:పరిశీలించాలని, కష్టపడిన జన సైనికులను గుర్తించాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు గురుప్రసాద్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతోమంది పనిచేశారని, ఇప్పుడు అధికారంలోకొచ్చిన తర్వాత పార్టీ ఫిరాయించిన వారికి ఈ పదవి కట్టబెట్టడంపై బాధపడుతున్నామన్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులను జన సైనికులుగా మార్చడం కోసం అహర్నిశలు పనిచేసిన వారు అనేకమంది ఉన్నారని, అందులో ఎవరికి ఈ పదవి ఇచ్చినా బాగుండేదని, అలా కాకుండా పార్టీ కోసం ఏమాత్రం పనిచేయని వారికి పదవి ఇవ్వడం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కొండా ఉదయ్ శంకర్, కామేష్, విష్ణుప్రియ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జనసేన కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పౌర హక్కుల రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో పౌరహక్కుల పరిరక్షణ, అట్టడుగు వర్గాల రక్షణ కోసం పిసిఆర్, పిఒఎ చట్టాల అమలు కఠినంగా జరగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. అత్యాచార నిరోధక చట్టం (పిసిఆర్ అండ్ పిఒఎ యాక్ట్) అమలు అంశాలను అధికారులు సమీక్షించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అట్టడుగు వర్గాలపై జరిగే హింసాత్మక చర్యలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొత్తం తొమ్మిది మందికి రూ.6,95,052 పరిహారం అందించామని, హత్య కేసుల్లో ఉపాధి కల్పనలో 11 మందికి ఉద్యోగం ఇచ్చామని చెప్పారు. ఒక కేసులో ఉపాధి పెండింగ్‌లో ఉందని, అర్హులు ఒకరికి ఇప్పటికే రూ.8,25,000 చెల్లించామని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం పిఒఎ చట్టం కింద ప్రత్యేక కోర్టులో 267 విచారణలో ఉన్నాయని ఉన్నాయని తెలిపారు. వీటిని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, వారానికి ఒక గ్రామాన్ని అధికారులు సందర్శించి ఆలయ ప్రవేశం, నీటి వనరుల వినియోగం, వేరు గ్లాసుల వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిపిలు, సంక్షేమ శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు దండాసి రాంబాబు, తోట రాములు, దాసరి తిరుమలరావు, బి.వి.ఎస్.ఎన్ రాజు, శాంతారావు, ఎస్.ప్రభాకరరావు, వి.దాలయ్య, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, పలువురు డిఎస్‌పిలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

ఫేస్ యాప్ ద్వారా సరుకుల పంపిణీ
ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారుల ఫేస్ యాప్ ద్వారా సరుకులు పంపిణీ చేయాలని జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి బి.శాంతిశ్రీ అన్నారు. మండలం మాతన్నపల్లిలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలాస, మందస మండలాల ఐసిడిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శతశాతం ఫేష్ యాప్ ఆప్‌లోడ్ చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటివరకు జిల్లాలో చాలావరకు ఫేస్ యాప్ అప్‌లోడ్ జరిగిందని, ఆగష్టు నెల నుంచి లబ్ధిదారులకు ఈ యాప్ ద్వారా సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు అంగన్వాడీ కేంద్రాలను విఒలు, సూపర్‌వైజర్లు తనిఖీ చేయాలన్నారు. మాకన్నపల్లి అంగన్వాడీ పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో కాశీబుగ్గ ఐసిడిఎస్ విఒ పార్వతి, సూపర్‌వైజర్లు యు.లత, గంగమ్మ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన జెవివి నాయకులు

జన విజ్ఞాన వేదిక నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక (జెవివి) నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పైల రవికుమార్, స్కూల్ సిబ్బంది, కార్యదర్శి పైడి రామస్వామి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సభ్యులందరి ఏకగ్రీవ సమ్మతితో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోట ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ షావలి, గౌరవ అధ్యక్షులుగా పి.మోహనరావు, ఉపాధ్యక్షులుగా బి.శరత్ కుమారి, ఎస్.అరుణ, కోశాధికారిగా జి.అప్పారావు, సమతా, కన్వీనర్ ఎం. ఉమా కుమారి, కల్చరల్ కన్వీనర్ ఎన్.సులోచన రాణి, విద్యావిభాగం కన్వీనర్ పిఆర్ఎస్ నాయుడు, హెల్త్ కన్వీనర్ జి.కుమారి, యూత్ కన్వీనర్ ఎం.విఆర్ బట్లు, సోషల్ మీడియా కన్వీనర్ టిసిహెచ్ మనోహర్, సైన్స్ కమ్యూనికేషన్ కన్వీనర్ బి.ఎ.శివరాజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోట ఈశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ దృష్టికోణం, మూఢనమ్మకాల నివారణతో కూడిన సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఎడ్యుకేషన్ సబ్‌కమిటీ కన్వీనర్ గొంటి గిరిధర్, ఆమదాలవలస జోన్ గౌరవ అధ్యక్షులు కె.ఎ.రాములు, జెవివి సమత నాయకులు సిహెచ్ సుబ్బలక్ష్మి, బి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్‌గా విజయలక్ష్మి


విజయలక్ష్మి

సోంపేట: కంచిలి ఎఎంసి చైర్మన్‌గా సోంపేట మండలం మాకన్నపురం గ్రామానికి చెందిన మద్దిల విజయలక్ష్మి నియామకం అయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాలు అందినట్లు ఆమె తెలిపారు. విజయలక్ష్మి భర్త మద్దిల నాగేశ్వరరావు మాకన్నపురం పంచాయతీ సర్పంచ్‌గా మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. అలాగే టిడిపి మండల అధ్యక్షుడుగా మూడు పర్యాయాలు పనిచేశారు. పార్టీకి విధేయుడుగా ఉండటమే కాకుండా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చేసిన కృషికి గుర్తింపుగా ఆయన భార్యకు నామినేటెడ్ పదవి దక్కిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. తమకు ఈ బాధ్యత అప్పగించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అశోక్, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విజయలక్ష్మిని ఎఎంసి చైర్మన్‌గా నియమించడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నరేంద్ర


నరేంద్ర యాదవ్

ఇచ్ఛాపురం: గత 11 ఏళ్లుగా ఎటువంటి పార్టీ పదవి లేకపోయినా పార్టీ శ్రేయస్సు కోసం, పార్టీ ప్రయోజనాల కోసం శ్రమించిన తనకి రాష్ట్ర వైసిపి విభాగంలో బిసిసెల్ కార్యదర్శిగా నియమించిన పెద్దలకు నర్తు నరేంద్ర యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నియామకానికి సహకరించిన బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబుకి, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం, నియోజకవర్గం సమన్వయ కర్త, శ్రీకాకుళం జిల్లా పరిశీలకులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తమ మద్దతు అందించాలని ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, గొర్లె కిరణ్ కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

చిన్నారి వైద్యానికి హెల్పింగ్ హేండ్స్ అండ

కవిటి: అనారోగ్యంతో బాధపడుతున్న తమ రెండేళ్ల చిన్నారిని కాపాడుకోవడానికి మల్లగుల్లాలు పడుతున్న ఓ కుటుంబానికి మండలానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. వివరాల్లోకి వెళ్తే కుసుంపురం గ్రామానికి చెందిన కీలు యశ్వంత్ అనే రెండేళ్ల బాలుడు తలలో ఇన్‌ఫెక్షన్ కారణంగా తరచూ మూర్ఛ వ్యాధికి గురవుతున్నాడు. వైద్యం కోసం పలు ఆస్పత్రులను ఆశ్రయించిన తల్లి దండ్రులకు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు సూచించడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కాశీ సాహు బాబు పరిస్థితిని స్వయంగా పరిశీలించి వెంటనే తన సహచరులు, సన్నిహితుల సాయంతో గత పదిరోజులుగా నిధులు సేకరించేందుకు కృషి చేశాడు. ఈ ప్రయత్నంలో రూ.50వేలు సేకరించి శుక్రవారం సాయంత్రం యశ్వంత్ తల్లిదండ్రులకు అందజేశాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. రమేష్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వానికి నిదర్శనమని, ఇటువంటి మంచిపనిలో తనని భాగస్వామిగా చేసిన హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యాధి దృష్ట్యా అతనికి పూర్తిగా నయమయ్యేవరకూ చికిత్స తప్పనిసరిగా అందించాలని, దానికి మరింతమంది దాతల సాయం అవసరమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న రమేష్ కుమార్

బియ్యం బస్తాల్లో తరుగు

- గోదాం వద్దనే మాయాజాలం
- రుజువైన తూనికల మోసం
- పట్టుకున్న డీలర్లు


ప్రైవేటు వేబ్రిడ్జి వద్ద తూకం వేస్తున్న ట్రాలీ

ప్రజాశక్తి- లావేరు

పౌరసరఫరాల శాఖ ప్రజాపంపిణీ వ్యవస్థలో బియ్యం, పంచదార, కందిపప్పు ఇతర నిత్యవసర సరుకులు కార్డుదారులకు ప్రతినెల అందజేస్తున్నారు. ఇదే క్రమంలో మండల గోదాం నుంచి గ్రామాల్లోని రేషన్ డిపోలకు వెళ్లే బియ్యం బస్తాల్లో భారీగా తరుగులు రావడంతో గోదాం వద్దనే తూకంలో మాయాజాలంతో డీలర్లు తరుగులతో ఇబ్బందులు పడుతూ ప్రతినెలా తమజేబుల్లో డబ్బులు పెట్టి కార్డుదారులకు బియ్యం కొని ఇచ్చే పరిస్థితితో డీలర్లు గగ్గోలు పెట్టేవారు. శుక్రవారం ఎట్టకేలకు గోదాం వద్దనే తూకంలో మాయాజాలం చేస్తున్న వైనాన్ని కొంత మంది డీలర్లు పట్టుకున్నారు. లావేరు డిపో నెంబర్ 02కు 3945 కిలోల బియ్యాన్ని లావేరు డిపో నెంబర్ 29కు 5,412 కిలోల బియ్యం మొత్తం రెండు డిపోలకు 9,357 కిలోల బియ్యాన్ని మండల పౌరసరఫరాల గోదాం వద్ద ఒక ట్రాలిలో లోడు చేశారు. దీని ప్రాప్తికి ఆర్ఒలు రాసి పంపించారు. ఇక్కడ తూకంలో మాయాజాలంతో తేడాలు వస్తున్నాయని ఇక్కడ వీరు కాటలో తూకం సరిపోతున్నట్లు చూపిస్తున్నారు. డీలర్లు డిపోలకు వెళ్లే సరికి భారీగా తరుగులు వస్తున్నాయని ఎంఎల్ఎస్ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌తో డీలర్లు ముప్పిడి రమేష్, ఇజ్జు సత్తిబాబు, మంగరాజులు ప్రశ్నించగా ఇక్కడేం తేడాలు, మోసాలకు ఆస్కారం లేదని గదమాయించడంతో డీలర్లు మీరు ఇక్కడ కాటాపై తూకం వేసిన వాహనాన్ని ప్రైవేటు వేబ్రిడ్జిపై తూకం వేసుకుంటామని అడగడంతో చేసేది ఏమిలేక ఇన్‌ఛార్జి ప్రవీణ్ అయిష్టంగానే ఒప్పుకోవడంతో బొంతుపేట వద్ద ఉన్న శ్రీ శివ సూర్య వేబ్రిడ్జి వెద్ద బియ్యంతో ఉన్న ట్రాలీని తూకం వెయ్యగా రెండు డిపోల బియ్యం 9,357 కిలోలు, ట్రాలీతో కలిపి 13617 కిలోలు మొత్తం తూకం వచ్చింది. అనంతరం సరుకు దింపిన తర్వాత ఖాళీ వాహనాన్ని తూకం వెయ్యగా 4,260 కిలోలు వచ్చింది. మొత్తం 9357 కిలోల బియ్యం రావాల్సి ఉండగా 9,200 కిలోలు మాత్రమే నికరం వచ్చింది. ఇంకా 157 కిలోలు గోదాం వద్ద తూకానికి, ప్రైవేటు వేబ్రిడ్జిపై తూకానికి వ్యత్యాసం వచ్చింది. దీంతో గోదాం ఇన్‌ఛార్జితో పాటు అక్కడ సిబ్బంది గొంతులో పచ్చ వెళక్కాయ పడినట్లు అయ్యింది. అక్కడ ఇన్నాళ్లుగా ఎంత మాయాజాలం చేస్తున్నారో ఈరోజుతో బట్టబయలైంది. 50 కిలోలు బియ్యం బస్తాకి 45 కిలోలు, 47 కిలోలు, 42 కిలోలు తక్కువగా వస్తుండడంతో డీలర్లు నష్టపోయారు. ఇటీవల రణస్థలం, లావేరు మండలాల్లోని సుమారు 180 డిపోలుకుగాను ఇక్కడ నుంచే సరుకులు వెళ్తున్నాయి. తూకం తేడాల్లో ఇన్‌ఛార్జి కంప్యూటర్ ఆపరేటర్ అమర్, వాచ్‌మేన్ కరుణాకర్‌లు ఒక్కటై భారీగా తూకంలో మాయజాలంతో దోచేస్తున్నారని డీలర్లు విమర్శిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇక్కడ తూకంలో మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తమకు తరుగులు లేకుండా తూకంలో మోసం లేకుండా సరుకులు ఇచ్చి మమ్మల్ని నష్టాల నుంచి గట్టెక్కించాలని వారంతా కోరుతున్నారు. అయితే జూలై 2న 'బియ్యం బస్తాల్లో తరుగు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది.


మండల పౌరసరఫరాల గోదాం

రిలే నిరాహార దీక్ష

టెక్కలి: దళితుడునైన తనను తన భూమిమీదకు వెళ్లకుండా అడ్డుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళితుడు బొకర మోహనరావు టెక్కలి తహశీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మండలంలోని చింతల గార గ్రామం వద్ద నున్న భూమిని సబ్‌డివిజన్ చేసి అప్పగించేందుకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి సంఘీభావాన్ని ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ దీక్షలో నారాయణ, వాణి, చిన్నవాడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కమిటీ వేయడం అభినందనీయం

టెక్కలి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఆర్ఎంపిల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయడం అభినందనీయమని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తారు రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయాంలో జారీ చేయబడ్డ 456 జిఒను అమలు చేయాలన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం హయాంలో కమిటీ వేయడంపై రాజశేఖర్‌తో పాటు ఆర్ఎంపి వైద్యులు తర్లా భాస్కరరావు, టి.యాదవరావు, ఆర్.ఎల్.రాజు, ప్రసాద్, గుప్త, రమేష్, పండా, చిరంజీవి తదితరులు అభినందించారు.

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్


శ్రీనివాస్

నరసన్నపేట: అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన కొన్న శ్రీనివాస్ నియమితుల య్యారు. ఒంగోలు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కొన్న శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు భావ జాలంతో యువకుల హక్కుల కోసం, నిరుద్యోగ యువత కోసం పోరాడి యువజన సంఘంలో కీలకంగా వ్యవహరించారు. శ్రీనివాస్ ఎన్నికపై జిల్లాలో పలు విద్యార్థి, యువజన, కమ్యూనిస్టు నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకొని తనపై మరింత బాధ్యత పెంచిందని, యువజన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నికపై ఎఐవైఎఫ్ జిల్లా సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

స్వాభిమాన్‌లో ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వాభిమాన్ (దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు వారు) ఫిర్యాదులు స్వీకరణ శక్రవారం నిర్వహించారు. వచ్చిన అర్జీలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. ఎక్కువగా ఫించన్లు, ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు వంటి వాటికి దరఖాస్తులు చేసుకున్నారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన గేదెల చిన్నారావు తనకు రెండు కాళ్లు లేవని, రూ. 6 వేలు పింఛన్ వస్తుందని, రూ.15 వేలుకు అర్హత ఉందని చెప్పారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన సంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. లావేరు మండలం అదపాకకు చెందిన బారికోడు, గోవింద్‌తో కూడిన ఐదుగురు వికలాంగులు ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన డిగ్రీ చదువుతున్న మణికంఠ ల్యాప్‌టాప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ప్రతి వికలాంగుని సమస్య విన్నారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్‌పి సిఇఒ, విభిన్న ప్రతిభావంతుల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు ఎల్ఎన్‌వి శ్రీధర్ రాజాను సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వాభిమాన్‌కు 17 అర్జీలు వచ్చాయి. ఫిర్యాదులు స్వీకరణలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ గతంలో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలు తెలియజేయా లన్నారు. బ్యాటరీ సైకిల్, సదరం సర్టిఫికెట్, పింఛన్లు, హౌసింగ్, ఉపాధి, వినికిడి మిషన్‌పై వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు.


వికలాంగుల సమస్యలు వింటున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

ఉద్యోల నుంచి ఫిర్యాదులు స్వీకరణ

ఉద్యోగుల గ్రీవెన్స్‌లో ఎపి ఎన్‌జిఒ నాయకులు హనుమంతు సాయిరాం కలెక్టర్‌కు కారుణ్య నియామకాలు పూర్తిస్థాయిలో నియమించాలని, ఉద్యోగులకు కార్పొరేట్ ఆస్పత్రిలో కొన్ని రోగాలకు మాత్రమే వైద్యం జరుగుతున్నట్లు వివరించారు. అన్ని వ్యాధులకు వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు సహకారం అందించాలి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదలను ధనవంతులు చేసేందుకు బంగారు కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందని ఆ కుటుంబాలకు సహకారం అందించాలని పలాస నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి.శాంతిశ్రీ అన్నారు. మండలం మాకన్నపల్లి, నీలావతి, గురుదాసుపురం, మామిడిమెట్టు పంచాయతీలో శుక్రవారం బంగారు కుటుంబాలపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పేద కుటుంబాలను ఎంపిక చేసి వారికి చేయూత అందించడమే బంగారు కుటుంబాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వసంతకుమార్, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, సర్పంచ్‌లు దేశయ్య, కత్తుమ రూపాపతి, కుత్తుం లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

6,678 కుటుంబాలు ఎంపిక

నియోజకవర్గంలో 6,678 కుటుంబాలను ఎంపిక చేసినట్లు శాంతిశ్రీ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 1396 కుటుంబాలను గుర్తించడం జరిగిందని, ఈ కుటుంబాలను జరుగుతున్న గ్రామసభల్లో చర్చించి నిజమైన పేదలను ధనవంతులు చేయడం జరుగుతు ందన్నారు. ఆర్థికంగా, వైద్య, వివిధ రూపాల్లో బంగారు కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న శాంతిశ్రీ

మరణించిన రైతులకు వ్యవసాయ రుణాలు

- కోట్ల రూపాయల కుంభకోణం
- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం


సహకార సంఘ రుణాలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని కొత్తకోట సహకార సంఘంలో జరిగిన కోట్ల రూపాయల కుంభకోణంపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్తకోట సహకార సంఘం పరిధిలో గత మూడేళ్లలో మృతి చెందిన రైతుల పేరిట వ్యవసాయ రుణాలు 13 మంది బినామి రైతులకు రూ.కోటి 30 లక్షలు స్వాహాపై రైతులు ధ్వజమెత్తారు. ఇటువంటి తప్పుడు విధానాలతో సహకార సంఘ బ్యాంకులపై రైతులకు నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. దీనిపై డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ మాట్లాడుతూ కొత్తకోట సహకార సంఘంలో అవినీతి జరగడం గుర్తించామని దీంతో పాటు జిల్లాలో కూడా పలు సహకార సంఘాల్లో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీయడం జరుగుతుందన్నారు. అలాగే గత పాలకవర్గంలో వివిధ కారణాలతో సహకార సంఘం వ్యయం పెరగడం ద్వారా ప్రస్తుతం రూ.39 లక్షలు నష్టాల్లో సంఘం కొనసాగుతుందని సిఇఒ బి.వి.సన్యాసిరావు తెలిపారు. ఇనాం రైతులకు అన్నదాత సుఖీభవతో పాటు ఖరీఫ్ సాగు చేసే రైతులకు ఎరువులు, కౌలు రైతులకు వ్యవసాయ రుణ సదుపాయం సక్రమంగా జరగడం లేదని సభ్యులు సమావేశంలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాల మూసివేతపై జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు మండల విద్యాశాఖ అధికారులను ప్రశ్నించగా ఈ ఏడాది మండలంలో కనీస అడ్మిషన్‌లు 12 పాఠశాలల్లో జరగలేదని, విద్యార్థులు లేక నక్కలపేట, అవతారాబాద్ పాఠశాలను మూసివేసినట్లు ఎంఇఒ బాలరాజు తెలిపారు.

రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు వృద్ధులకు, వికలాంగులకు నిత్యవసర సరుకులు అందించడం లేదని, కొన్ని గ్రామాలకు చౌక దుకణాలు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో రేషన్ కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రేషన్ లబ్ధిదారులకు డీలర్లు సరుకులు అందించ డంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై తక్షణమే స్పందించాలని తహశీల్దార్ ఎల్.మధుసూదన్‌ను సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ప్రశ్నించారు. కొంతమంది డీలర్లు ఇతర గ్రామ కార్డుదారులకు సరుకులు అందించేటప్పుడు కార్డుదారుల నుంచి కొంత నగదు వసూలు చేయడం జరుగుతుందని సర్పంచ్‌లు ఆరోపించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కెవిజి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గోవింద, వెంకట శివానందమూర్తి, ఎంపిడిఒ ఎం.పావని, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన సాగుతుందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. మండలంలోని దండు గోపాలపురంలో వైసిపి మండల అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి అధ్యక్షతన బాబూ ష్యూరిటీ ...మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు దర్మాన కృష్ణదాస్, టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రణాళిక బద్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఎన్నికల హామీలను అమలు చేయలేని ప్రభుత్వం ప్రశ్నిస్తుంటే పాల్పడుతుందని ఆరోపించారు. ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన సూపర్ సిక్స్ మోసాలు ప్రజలకు గుర్తు చేయాలన్నారు. అమలు కాని హామీల వల్ల ఒక ఏడాదిలో ప్రజలకు పథకాల కింద రావాల్సిన రూ.80 వేల కోట్లను చంద్రబాబు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. పేరాడ తిలక్ మాట్లాడుతూ కార్యకర్తల్లో ఉత్తేజపరిచే ప్రసంగం చేశారు. ల్యాండ్ మాఫియా, లిక్కర్ మాఫియాలకు పాల్పడుతూ కింజరాపు అచ్చెన్నాయుడు, వారి కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి కార్యకర్తలు, నాయకులపై అణచివేత ధోరణితో వ్యవహరిస్తూ తప్పుడు కేసులు బనాయిస్తూ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అవసరమైతే రాజీనామా చేయాలని తిలక్ కోరారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జిల్లా బిసిసెల్ అధ్యక్షులు మార్పు అశోక్ చక్రవర్తి, జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, ఎంపిపి మేరుగు అప్పారావు, వైస్ ఎంపిపి నక్క భీమారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కిల్లి గోవిందరావు, నాయకులు ఎన్ని మన్మధరావు, జోగి రాములమ్మ, పొందల రామకృష్ణ, సుగ్గు రామిరెడ్డి, మార్పు నాగభూషణం, కోత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వ పాలనలో ఇబ్బంది పడుతున్న ప్రజల పక్షాన పోరాటాలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి సిద్ధం కావాలని మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరులో నిర్వహించిన బాబూ ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టిడిపి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 143 హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. రికార్డు స్థాయిలో అప్పులు చేసి ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమి లేదని విమర్శించారు. పి4 పథకంతో పేదల ఆత్మగౌరవాన్ని ధనవంతులకు తాకట్టు పెట్టే కార్యక్రమం ప్రభుత్వం చేపడుతుందని దీనిని వ్యతిరేకించాలని కోరారు. కార్గో ఎయిర్ పోర్ట్ కోసం పచ్చని ఉద్దానం జీడి తోటలను నాశనం చేయకుండా కేంద్ర అధీనంలో ఉన్న సుమారు 1850 ఎకరాల ఉప్పు భూములు వినియోగించుకుని ప్రభుత్వ పెద్దలు చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు తిర్రి రాజారావు, వైసిపి నాయకులు వెంకటరావు దొర, దువ్వాడ మధుకేశవరావు, మద్దిల హరినారాయణ, గురయ్య నాయుడు, మందస ఎంపిపి డొక్కరి దానయ్య, మామిడి భాస్కరరావు, విద్యాసాగర్, దున్న బాలరాజు, ప్రేమకుమార్, కొర్రాయి గోపి, హేమంత్, టి.శాంతారావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : మాట్లాడుతున్న కృష్ణదాస్

పొందూరు: అధికారం చేపట్టేందుకు సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, బూర్జ వైసిపి మండల అధ్యక్షుడు కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, వైసిపి నాయకులు చింతాడ సత్యప్రసాద్, నాగభూషన్, రాధాకృష్ణ, బొడ్డేపల్లి పద్మజ, గిరిబాబు, గాడు నాగరాజు, గుడ్ల మోహన్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత విఆర్ఒ మృతి


వెంకటరావు (ఫైల్)

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గురుగుబిల్లి గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్ఒ బాడిత వెంకటరావు (78) శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. వెంకటరావు తొలుత విలేజ్ అసిస్టెంట్‌గా, విఆర్ఒగా సిగురికొత్తపల్లి, పాలకొండలో పని చేశారు. కలెక్టరేట్‌లోనూ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగ విరమణ తర్వాత వైసిపిలో చేరి నాయకునిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేశారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గెలుపుకోసం తీవ్రంగా శ్రమించారు. తెలగ సంఘం ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారు. ఆయనకు భార్య లక్ష్మీనర్సమ్మ, ఇద్దరు కుమారులు దొరబాబు, సాయికుమార్ ఉన్నారు. వెంకటరావు మృతి విషయం తెలుసుకున్న రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, లావేరు టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లావేరు, రణస్థలం జెడ్‌పిటిసిలు మీసాల సీతంనాయుడు, టి.సీతారాం, గురుగుబిల్లి సర్పంచ్ బాడిత కళ్యాణి తదితరులు వెంకటరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అంతిమ యాత్రలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గంజాయి నిందితులను ప్రవేశపెట్టిన సిఐ, ఎస్ఐలు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మీసాల చిన్నం నాయుడు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీలు చేయగా నిందితుల వద్ద నుంచి 13.090. కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని సునీలా పైకా, త్రిలోక్ నాతురాం తొల్పూరియాను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కేజీ 13.090 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను టౌన్ పోలీసులు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారన్నారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుంధరావు తదితరులు పాల్గొన్నారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చిరంజీవి

బంగారు షాపు యజమాని ఇంట్లో చోరీ

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలోని శ్రీరామాంజనేయ థియేటర్ ఎదురుగా ఉన్న కాలనీలో గురువారం రాత్రి చోరీ జరిగింది. మూడు కేజీల వెండి, తులమున్నర బంగారాన్ని దుండగులు అపహరించారు. బాధితుల కథనం ప్రకారం.. రణస్థలం మండల కేంద్రంలోని నాయుడు జ్యూయలరీ షాపు యజమాని లెంక దిలీప్ కుమార్ పిల్లల చదువుల కోసం వారం రోజుల క్రితం శ్రీకాకుళం వెళ్లిపోయారు. అవసరమైన సామాన్లు తీసుకుని శ్రీకాకుళంలో అద్దెఇంట్లో ఉంటున్నారు. రణస్థలంలో సొంత ఇళ్లుకావడంతో ఖాళీ చేయకుండా షాపు నుంచి దిలీప్ కుమార్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి గంట విశ్రాంతి తీసుకుని షాపుకి వెళ్లి రాత్రి శ్రీకాకుళం వెళ్లిపోతున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి వెండి, బంగారం అపహరించుకుపోయినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దిలీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

21న అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లుకు ఫేస్‌యాప్ రద్దు చేయాలని, సెంటర్లు నిర్వహణకు ఒకే యాప్ చేయాలని కోరుతూ ఈనెల 21న ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమం చేపడతామని తెలియజేస్తూ శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి.హేమలత, కె.లక్ష్మీ, ధనలక్ష్మీ, అనురాధ, నీరజ, శ్రీలత, సిర్ల ప్రసాద్, బోడమ్మ తదితరులు పాల్గొన్నారు.

జయలక్ష్మి నేత్రాలు సజీవం


జయలక్ష్మి (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని చంపాగల్లి వీధికి చెందిన అంధవరపు జయలక్ష్మి (68) శుక్రవారం మృతి చెందారు. ఆమె స్మారకార్థం కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో ఆమె నేత్రాలను దానం చేశారు. కుమారుడు అందవరపు సుబుద్ధి, కోడలు సత్యవతి అనుమతితో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్లు పి.సుజాత, బి.జగదీష్ నేత్రాలను సేకరించి, విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర కేంద్రానికి పంపించారు. ఈ సేవాత్మక చర్యకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కె.దుర్గ శ్రీనివాస్ కుటుంబాన్ని అభినందించారు. నేత్రదానం చేయాలనుకునే వారు 7842699321 నంబర్‌కి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

సొసైటీల ద్వారా మెరుగైన సేవలు

ఇచ్ఛాపురం: పిఎసిఎస్ ద్వార రైతులకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక పిఎసిఎస్ కార్యాలయం వద్ద నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విప్ మాట్లాడుతూ గత పాలకవర్గంలా కాకుండా నిజమైన రైతులకు సేవలు అందించాలన్నారు. గతంలో రైతులు కానివారు కూడా రుణాలు పొందిన సంఘటనలు ఉన్నాయని, అలా పునరావృతం కాకుండా మెరుగైన సేవలు అందించాలని నూతన పాలక వర్గానికి సూచించారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతో బాధ్యతతో కూడిన ఈ పదవితో రైతులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. గతంలో జరిగిన అవకతవకలు వెలికితీయాలని, నిజమైన రైతులకు న్యాయం చేయాలన్నారు. పిఎసిఎస్ అధ్యక్షుడుగా పెద్దిన బాబ్జీ, సభ్యులుగా బాసిన భారతి, గిన్ని బాలరాజుకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ భుజంగరావు, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మణి చంద్ర ప్రకాష్, టిడిపి నాయకులు సదానంద రౌలో, లోపింటి పద్మనాభం, పత్రి తవిటియ్య, నందిగాం కోటి, దక్కత కామేశ్వరరావు, దక్కత ఢిల్లీరావు, మెరుగు సూర్యనారాయణ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పొందల కృష్ణారావు, కృష్ణయ్య, నందికి జాని తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒలతో మాట్లాడుతున్న విజయకుమారి

మోడల్ ప్రైమరీ పాఠశాలలు దయనీయం

పొందూరు: మండలంలో తొమ్మిది మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 45లోపు విద్యార్థుల సంఖ్య ఉండడం శోచనీయమని శ్రీకాకుళం ఉపవిద్యా శాఖాధికారి ఆర్.విజయకుమారి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలల్లో నిబంధనల మేరకు కచ్చితంగా కనీసం 45మంది విద్యార్థుల సంఖ్య ఉండాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు సమైక్యంగా కృషిచేయాలని, నైతిక విలువలను పెంపొందించేందుకు విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పులు తీసుకు రావాలన్నారు. ఒకప్పుడు విద్యా చరిత్రలో సముచిత స్థానం పొందిన స్థానిక రెండో నంబర్ ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించినట్టు ఎనిఒలు జి.శ్రీరాములు, పి.రాజారావు ఆమెకు నివేదించారు. అలాగే మూడో నంబర్ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను నాలుగో నెంబర్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసినట్టు పేర్కొన్నారు. చివరిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. సిలబస్, కిట్ల పంపిణీ, విద్యార్థుల నమోదులు తదితర అంశాలను పాఠశాల హెచ్‌ఎం ఎం.వాగ్దేవితో చర్చించారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

కోటబొమ్మాళి: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని టెక్కలి ఆర్‌డిఒ ఎన్. కృష్ణమూర్తి అన్నారు. స్థానిక తహశీల్దార్ ఆర్.అప్పలరాజుతో కలిసి సకలాభక్తుల పెంటయ్య ఎరువుల దుఖాణాన్ని అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్, గొడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలించారు. మండలంలో రైతులకు ఎటువంటి ఎరువుల కొరత లేకుండా సకాలంలో రైతు సేవా కేంద్రాలు, ఎరువుల డీలర్ల ద్వారా అందించాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

పొందూరు: మండలంలోని గూనాన పేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి మండలంలోని మలకాం ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ అయిన గురుగుబిల్లి మధుబాబును శుక్రవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు సత్కరించారు. గ్రామంలో సుమారు ఎనిమిదేళ్లు ఉపాధ్యా యునిగా పనిచేసి విద్యార్థుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గ్రామ స్తులు కొనియాడారు. దుశ్శాలువ, జ్ఞాపకతో ఘనంగా సత్కరించారు.



ప్రజలకు ప్రభుత్వ ప్రగతి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యంగా శ్రీకాకుళం నియోజకవర్గం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా నగరంలో ధమ్మల వీధి, గుడి వీధి, చంపగళ్ళ వీధి, ఎచ్చెర్ల వీధి, కస్పా వీధుల్లో శుక్రవారం పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మాట్లాడుతూ తనను అభిమానించే ప్రజలు, కార్యకర్తల కోసం, నిర్విరామంగా పని చేస్తానని అన్నారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కూటమి హయాంలో ఉత్తరాంధ్రకు మహర్దశ

ఆమదాలవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశగా అద్భుత పురోగతి సాధించిందని టిడిపి నాయకులు, విశ్రాంత తహశీల్దార్ పేడాడ జనార్ధనరావు తెలిపారు. శుక్రవారం శ్రీహరిపురంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఒకే ఏడాదిలో ఉత్తరాంధ్ర అభివృద్ధి పునాదులు వేయబడ్డాయని, గతంలో కంభంపాటి హరిబాబును గవర్నర్‌గా నియమించగా, తాజాగా అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడం ఈ ప్రాంతానికి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను చాటుతోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చే ఏడాది ప్రారంభం కానుండగా ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి గేట్వేగా మారనుందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కోట్ల ప్యాకేజీ ప్రకటించారని, మూడు బ్లాస్ట్ ఫర్నేసులు తిరిగి ప్రారంభించేందుకు కేంద్రాన్ని ఒప్పించి సిఎం చంద్రబాబు నిధులు సాధించారని అన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు, విశ్రాంత తహశీల్దార్ సనపల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

శిరీషను కలిసిన కృష్ణయ్య

పలాస: ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీమంత్రి గౌతు శివాజీని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం గౌతు శిరీషకు ఘనంగా సన్మానించారు. కాలుష్య నియంత్రణపై చర్చించి ఈ ప్రాంతంలో ఉన్న జీడి పరిశ్రమలు, ఇంకా ఏమైనా పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలాస నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణశ్రీ, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



శ్రీకాకుళం సిటీ : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని స్థానిక విశాఖ ఎ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. శ్రీకాకుళం పట్టణం, శ్రీకాకుళం రూరల్, గార మండలాలు నుంచి ప్రజలు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినతి పత్రాలు అంశాలు ఆధారంగా సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు చెప్పారు. ప్రతి సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హత ఆధారంగా అందజేయనున్నట్లు వివరించారు.

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధి నుంచి వచ్చిన ప్రజలు విభిన్న సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు, సంపదరావు మురళీ, నాగళ్ల మురళీధర్ యాదవ్, పివివికె రాజు, రీసు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పలాస: ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో ప్రజాధర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బురద గుంతల్లో దిగబడిన ఇసుక లారీలు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

బూర్జ: మండలంలోని గుత్తావల్లి, చీడివలస ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో శుక్రవారం ఉదయం ఇసుక లారీలు దిగబడిపోయాయి. అనునిత్యం నదీతీర ప్రాంతాల నుంచి ఇసుకలోడ్లుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండంతో పూర్తిగా గోతులమయంగా తయారైంది. దీంతో సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని గుంతలో దిగబడిన లారీలను బయటకు తెచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

గుత్తావల్లి, చీడివలస గ్రామ రహదారి వద్ద శుక్రవారం సాయంత్రం ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. అనునిత్యం ఈ రహదారిపై ఇసుక లోడ్లుతో భారీ వాహనాలు రాకపోకల వలన రహదారి గోతులమయంగా తయారైందని, అంతేకాకుండా ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. వృద్ధులు చిన్నపిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న అధికారులు లేరన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు.

లక్ష్యసాధన దిశగా శ్రమించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి



విద్యార్థులను సత్కరిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తదితరులు

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పెద్ద. గంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కంచరాన రోహన్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరజాడలో దుప్పల ఆంజనేయమూర్తి రిటైర్డ్ లెక్చరర్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, మంచి సమాజం ఏర్పడాలంటే నైతిక విలువలతో కూడిన విద్యని అందివ్వాలన్నారు. గతేడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బగాతిమహి ప్రథమ రూ.15 వేలు, రాయపల్లి రాకేష్, గేదెల హరికృష్ణలకు చెరో రూ.10 వేలు చొప్పున, ప్రగడ శృతి రూ.5 వేలు నగదుతో పాటు జ్ఞాపికను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆంజనేయ మూర్తి కుటుంబ సభ్యులు అల్లుడు రోహన్ కుమార్, కుమార్తె ఝాన్సీ అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరమణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ బమ్మిడి పున్నయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జోగ హేమలత, రవికుమార్, హనుమంతు చంద్రశేఖర్, బమ్మిడి జగన్నాథం, ఎల్ వెంకటాచలం, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, కె.శ్రీరాములు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి లావణ్య

ప్రజాశక్తి- లావేరు

రైతులు తమ పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బెజ్జపురం పశువైద్యదికారి లావణ్య అన్నారు. శుక్రవారం బెజ్జపురంలో పశువులకు లంపి స్కిన్ వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులుగా టీకాలు వేయడం జరుగుతుందని, అన్ని సచివాలయాల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి పశువుకు టీకాలు వేయాలన్నారు. శనివారం బొంతుపేట, బోరపేట గ్రామాల్లో డ్రైవ్ చేపడతామని తెలిపారు. ఈ వ్యాధిసోకిన పశువులు శరీరం అంతా కడతలతో అవి పగిలి పుండ్లు అయి ఆరోగ్యం క్షీణించి ఇబ్బంది ఏర్పడుతుందని రైతులు అశ్రద్ధ చేయవద్దని చెప్పారు. గ్రామాల్లో మా వైద్య బృందం వచ్చినప్పుడు అందుబాటులో లేని రైతుల ఆస్పత్రికి పశువులను తెస్తే టీకాలు వేయడం జరుగుతుందన్నారు. శుక్రవారం 350 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ నెలాఖరు వరకు టీకాలు వేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సోంపేట



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి దాసు

పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి కళ్యాణ మండలంలో ఈ నెల 20న ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు చేపట్టబోయే బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎంపిపి నిమ్మన దాసు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కుంటిసాకులు వేతుక్కుంటున్నారన్నారు. బాబుకి రాష్ట్ర ప్రజలను మోసం చేయడం అలవాటేనన్నారు. వైసిపి నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తడక జోగారావు, సిలగాన భాస్కరరావు, పి.కామేష్, పి. రేఖారావు, జె.రమేష్, బి.మాధవరావు, గిరి, కె.భీమ, తోట ఢిల్లీ, బి.మోహనరావు, రౌతు విశ్వనాథం, టి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో రసాయన శాస్త్ర (కెమిస్ట్). అధ్యాపక పోస్టుకు అతిథి అధ్యాపకునిగా పనిచేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ శరతబాబు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ పంచాయతీలో లోఓల్టేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎఇ శశికుమార్ తెలిపారు. పంచాయతీలో తిత్లీ తుఫాన్ ప్రభావంతో ఆక్వా కల్చర్‌కు, గ్రామానికి ఒకే లైన్‌లో విద్యుత్ సరఫరా అవుతుండడంతో లోఓల్టేజీ, విద్యుత్ కోతలను ఎదుర్కొంటున్నామని టిడిపి నాయకులు శాంతి స్వరూప రెడ్డి పలుమార్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో విద్యుత్ శాఖ సిబ్బంది నౌపడలోని పలు సమస్యాత్మక ప్రాంతాలు, వీధులను టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. అవసరమైన చోట కొత్త విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అధికారులు అంచనాలు తయారుచేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. సుగ్గు శాంతి స్వరూప రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



విద్యుత్ సమస్య ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

శక్తి యాప్‌తో మహిళలకు రక్ష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శక్తి యాప్ మహిళలకు రక్షణగా ఉంటుందని శక్తిటీం కాశీబుగ్గ సబ్ డివిజన్ ఎస్ఐ ఎం. రవికుమార్ అన్నారు. పూండి వివేకానంద పాఠశాలలో శక్తియాప్ వినియోగం, పనిచేసే విధానంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మహిళ తమ సెల్‌ఫోన్‌లో శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, నాటుసారా, గంజాయి, మద్యం వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై 1930, గ్రామాల్లో తగాదాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 112 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శక్తిటీమ్ ఎఎస్ఐ బైరాగి, సిబ్బంది సప్తగిరి, కరస్పాండెంట్ పేరాడ సోమేశ్వరరావు, హెచ్‌ఎం వనజ నాభమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న శక్తిటీమ్ సభ్యులు

ఐవిఆర్ కాల్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోంపేట: మండలంలోని కొర్లాం పంచాయతీలో శుక్రవారం డిఎల్‌పిఒ ఐ.వి రమణ ఆధ్వర్యంలో ఐవిఆర్ ఫోన్‌కాల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు కార్యదర్శి వరలక్ష్మీ, రాంబుడ్డి గణపతి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలకు ఐవిఆర్ కాల్స్ ఎందుకు చేస్తారు, వాటివల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఏదైనా ప్రజా సంబంధమైన సమస్య ఉంటే నేరుగా కాల్ చేసి, సమస్య పరిష్కారం చేయమని ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.చందు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

వజ్రపుకొత్తూరు: అనారోగ్యంతో బాధపడుతున్న పుచ్చ కాంతారావుకు యువతరం సేవాసమితి సభ్యులు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం ఉద్దానం గోపీనాథపురంలో బాధితుడు ఇంటికి వెళ్లి రూ.15 వేలు నగదు అందజేశారు. గత కొన్ని రోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతూ ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నాడు. కష్టాల్లో ఉన్న వారికి తమ సంస్థ అండగా నిలబడుతుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత మురళి, గోరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు, గర్తం పుష్పలత, కర్ని నారాయణరావు, కర్ని మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలం తాడివలస పంచాయతీలో సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. తాడివలస, గంద్రేడు, లచ్చయ్యపేటలో రూ.1.23 కోట్లుతో చేపట్టిన సిసి రహదారులు, కాలువల నిర్మాణాలు, రూ.90 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇఇ చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళీ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిడిపి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, బలగ శంకర భాస్కరరావు, బాడాన శేషగిరి, చింతాడ కృష్ణవాసుదేవరావు, సీపాన భాస్కరరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



సిసి రహదారులను ప్రారంభిస్తున్న రవికుమార్



గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

గిరిజన యువతకు శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆర్ఫ్ సంస్థ మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ నాబార్డు, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులపై గిరిజన యువతీ, యువకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో శిక్షణ చివరి రోజున పైనాపిల్ స్క్వాష్, పైనాపిల్ జామ్, పైనాపిల్ క్యాండీ తయారీపై చర్చించారు. పైనాపిల్‌లో ఉండే పోషక విలువలు ఆరోగ్యపరంగా ఎంతో లాభదాయకమని, జీర్ణవ్యవస్థ మెరుగుపడేందుకు, కొన్ని అధ్యయనాల ప్రకారం కేన్సర్ నివారణలో ఇది సహాయకారి అని పేర్కొన్నారు. అనంతరం కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ శిక్షణ ఆదివాసి మహిళలకు నైపుణ్యం పెంపుతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు దోహద పడుతుందని తెలిపారు. నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ కె.రమేష్ కృష్ణ మాట్లాడుతూ ఆదివాసుల వద్ద లభ్యమవుతున్న పైనాపిల్ పంటను వినియోగిస్తూ విలువదారిత ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను స్థాపించడానికి తమ సహకారంతో ఎఫ్‌పిఒల ద్వారా మార్కెట్‌కు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవచ్చునని తద్వారా ఆదివాసి యువత ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఫ్ సంస్థ కోఆర్డినేటర్ ఎన్.అనూప్, మన్యం సహజ ఉత్పత్తిదారుల సంఘం సిఒ బి.శంకరరావు, సభ్యులు, గిరిజన యువతీ, యువకులు పాల్గొన్నారు.

రైతులకు బిల్లులు ఇవ్వాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పలాస: ఎరువుల దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన పురుగుల మందులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఉన్న ఎరువుల దుకాణాలకు ఆకస్మిక తనిఖీలు చేశారు. తాళాసు గోవిందరావు రిటైల్ ఎరువులు, పురుగు మందుల దుకాణం తనిఖీలో భాగంగా ప్రతి ఏడాది మండల వ్యవసాయధికారికి సమర్పించాల్సిన ఫారం 10 సమయానికి సమర్పించకపోయిన విషయాన్ని గుర్తించారు. దీనివలన ప్రొఫెక్స్ సూపర్ అనే పురుగుల మందు యొక్క 100 మిల్లీలీటర్ల సామర్థ్యం గల 62 సీసాలు రూ.5270 విలువ గల పురుగుల మందుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విక్రయించిన ఎరువులకు, పురుగు మందులకు బిల్లులను తప్పని సరిగా రైతులకు ఇవ్వాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్స్, ఈ పాస్ మెషిన్‌లో ఎరువుల సమాచారం సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. తనిఖీ బృందంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి. విజయ ప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ డిపార్ట్మెంట్ ఆదారి సంతోష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి కిల్లి పోలరావు, డిఎఒ కార్యాలయ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరావు, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యపరీక్షల కోసం వచ్చిన రోగులు

ప్రజాశక్తి- పలాస

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్లకు రీజనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వైద్యులు సుజాత, వంశీలు ఆదేశించారు. శుక్రవారం 10వ వార్డు పరిధిలో కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద ఆయుర్వేద మైబైల్ హెల్త్ కేర్ కార్యక్రమంలో భాగంగా రోగులకు ఆయుర్వేదం మందులు వాడకం వలన వచ్చే ఉపయోగంపై వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా నీరునిల్వ, దోమలు పెరగడానికి అవకాశం ఉందన్నారు. ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ, చికెన్‌గన్యా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఈ వ్యాధులు ప్రబలడానికి దోమలే కారణమని ఆ దోమలు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై సరైన అవగాహన ప్రజల్లో వచ్చినప్పుడే ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సాయి ప్రసన్న, శ్రీరామ్, రాజేష్ కుమార్, కమలాకర్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి



విజయమ్మను పరామర్శిస్తున్న శ్రీకాంత్

మండలంలోని పెద్ద పద్మాపురం, బంజీరు గ్రామంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం పర్యటించారు. పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు లింగాల సంజీవరావు భార్య మాజీ సర్పంచ్ లింగాల విజయమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమెను పరామర్శించి ఓదార్చారు. అలాగే గేదెల నూకరాజు ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో ఆయనను పరామర్శించి ఓదార్చారు. బంజీరు గ్రామానికి చెందిన సాంబయ్య కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయలవ్వడంతో ఆయనను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎంపిటిసి ఉర్లాన ఋషి, సర్పంచ్‌లు గణేష్ ప్రధాన్, బోసి రామారావు, మాజీ సర్పంచ్ లింగాల సంజీవరావు, ఎన్ని లక్ష్మీనారాయణ, సలాణ సత్యం, ఇసై ఢిల్లేశ్వరరావు, నక్క వెంకటరావు, నాగరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డిఎల్‌పిఒ ఐ.వి రమణ ఆధ్వర్యంలో మండలంలోని కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ ఇకెవైసి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ తమకు అప్పగించిన లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన ఎ.వెంకటరావుకు స్థానిక ఎంపిడిఒ ఈశ్వరమ్మతో పాటు డిఎల్‌పిఒ రమణ, కార్యాలయ సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

యూకో బ్యాంకు శాఖ ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలో యుకో బ్యాంక్ కొత్త శాఖను విజయవాడ జోనల్ డిజిఎం అండ్ జోనల్ మేనేజర్ ఎస్.శర్వానన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బలహీన వర్గాలకు ఉత్తమ కస్టమర్ సేవ, ఆర్థిక అభివృద్ధి అందించడానికి ఈ ప్రాంతంలో ఈ శాఖను ప్రారంభించామన్నారు. పరిశ్రమలో రుణాలపై అత్యల్ప వడ్డీ రేట్లుతో బ్యాంకు వివిధ పథకాలను వివరించారు. యుకో బ్యాంక్ ఉత్తమ కస్టమర్ సేవను అందించడానికి కట్టుబడి ఉంటుందని, యుకో బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ అత్యధిక రేటింగ్ పొందిన యాప్ అని వివరించారు. యుకో బ్యాంకులో ఐటి రిటర్న్ దాఖలు చేసిన కస్టమర్లకు గృహ రుణ సౌకర్యాన్ని విస్తరింపజేస్తున్న కొత్త పథకం యుకో ఆశ్రయ్‌పై బ్రాంచ్ మేనేజర్ పైడి ఆదిత్య వివరించారు.